క్లుప్తంగా

హాకర్స్ జోన్‌లో షాపులకు దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు (టౌన్): ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఒక వైపు మాత్రమే చిరువ్యాపారులు వ్యాపారం చేసుకునేందుకు రూ.30 లక్షలు వెచ్చించి వినాయక్ ఘాట్ ఎదురుగా హాకర్స్ జోన్ ఏర్పాటు చేశారు. ఇందులో 20 కి పైగా షాపులు ఏర్పాటు చేశారు. అక్కడే వ్యాపారం చేసుకునే వారికి వాటిని కేటాయించేందుకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. బుధవారం నగరపాలక కార్యాలయంలోని మేనేజర్ చాంబర్‌లో పలువురు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తర్వాత అర్హులకు షాపులు కేటాయిస్తామన్నారు. అయితే, అక్కడ వ్యాపారం చేసుకునేవారు ట్రేడ్ లైసెన్సు, స్ట్రీట్ వెండర్ కార్డు కలిగి క్లాప్ యూజర్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వెండర్ జోన్ తప్ప ఇతర ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోరాదన్నారు

నేడు బీసీ హెచ్‌డబ్ల్యూఓల సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 9వ తేదీన ఉదయం 11.30 గంటలకు స్థానిక బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయ సమావేశ భవనంలో జిల్లాలోని బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి. వెంకటలక్షుమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సమావేశంలో వసతి గృహాల నిర్వహణ, జగనన్న విద్యా, వసతి దీవెన తదితర అంశాలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని హెచ్‌డబ్ల్యూఓ, సహాయ బీసీ సంక్షేమాధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఆకట్టుకునేలా విద్యాబోధన

కర్నూలు సిటీ: విద్యార్థులకు ఆకట్టుకునేలా విద్యాబోధన సాగాలని, ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారులు ఆదేశించారు. కర్నూలు డివిజన్ స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంత రావు, సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్, అకడమిక్ మానిటరింగ్ అధికారి ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ప్రతి నెలలో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపైనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో పెచ్చులూడి పడిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కలెక్టరేట్‌లోని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో పై కప్పు పెచ్చు ఊడిపడిన సంఘటన జరిగింది. కర్నూలు డివిజన్ టెక్నికల్ సహాయ సంచాలకులు డాక్టర్ మాధవి ఆఫీసు ద్వారం బయట పెచ్చు ఊడి పడింది. బయటికి వస్తున్న సమయంలో ఈ ఘటన జరగడంతో ఉలిక్కిపడ్డారు. త్రుటిలో ప్రమాదం తప్పినట్లు అయింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు కలెక్టర్ సృజన దృష్టికి తీసుకుపోనున్నట్లు తెలుస్తోంది.

మొక్కలు నాటితే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న రిటైర్డ్ డీఎఫ్ఓ

కర్నూలు(హాస్పిటల్): మొక్కలు నాటి పెంచితే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని రిటైర్డ్ డీఎఫ్‌వో బి. జయచంద్రారెడ్డి చెప్పారు. బుధవారం ఆయన గుత్తిరోడ్డులోని సర్వీస్ రోడ్డు వెంట మొక్కలు నాటారు. ఆయనకు స్థానిక మహిళలు, పిల్లలు సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కనూ పరిరక్షించాల్సిన బాధ్యత స్థానికులదేనన్నారు. మొక్కలు పెరిగి వృక్షాలైతే పర్యావరణ మనుగడకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో యమున వర్మీ కంపోస్ట్ యజమాని హరికృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

నేడు, రేపు కలెక్టరేట్‌లో మాక్ పోలింగ్

- ముగిసిన ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్
- రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో డీఆర్వో కె.మధుసూదనరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో

కర్నూలు(సెంట్రల్): ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ ముగియడంతో గురు, శుక్రవారాల్లో (9,10 తేదీలు) కలెక్టరేట్‌లో మాక్ పోలింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు డీఆర్వో కె.మధుసూదనరావు తెలిపారు. ఈ ప్రక్రియలో రాజకీయపార్టీలు తమ ప్రతినిధులు పాల్గొనేలా చూసి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ..జిల్లాలో అక్టోబర్ 16వ తేదీన ప్రారంభమైన ఓటింగ్ యంత్రాల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ బుధవారంతో ముగిసినట్లు చెప్పారు. మాక్ పోలింగ్‌ను 9,10 తేదీల్లో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీల తరఫున హాజరయ్యే ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేసి, వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామన్నారు. కాగా, ముసాయిదా జాబితాపై ఏమైనా అనుమానాలు ఉంటే అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, డిసెంబర్ 26వ తేదీలో అని ప్రక్రియలను పూర్తి చేసుకొని 2024 జనవరి 5వ తేదీ తుది ఓటరు జాబితాను విడుదల చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీ కార్డులో వివరాలు నమోదు చేయాలి



బాలికకు మాత్రలు అందజేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పిల్లలకు వ్యాక్సిన్ వేసిన వివరాలను ఎంసీపీ కార్డులో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన కర్నూలు మండలం భూపాల్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసీపీ కార్డులోని రొటీన్ ఇమ్యునైజేషన్ కౌంటర్ ఫోయిల్ కార్డును పూర్తి చేసి ఆ కార్డును ఆశాలు తీసుకుని దానిని ట్రిపుల్ బ్యాగ్‌లో ఉంచాలన్నారు. ఈ ట్రిపుల్ బ్యాగ్‌లో 12 నెలలకు సంబంధించి 12 బ్యాగులు ఉంటాయని, ఆ డ్యూ లిస్ట్ ప్రకారం ప్రతి నెలలో పిల్లలకు టీకాలు వేయించాలని తెలిపారు. సూపర్‌వైజర్లు ఆర్‌సీహెచ్ ప్రోగ్రామ్‌ను పర్యవేక్షిస్తూ ఏఎన్ఎంల ద్వారా అన్ని కార్యక్రమాలు పరిశీలించాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి వారితో మాట్లాడారు. మాతాశిశు సంరక్షణ సేవల గురించి వారికి వివరించారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్ -ఎ సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణకు బహిరంగ వేలం



నగరపాలక కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

- పోటీ పడిన పాటదారులు
- కర్నూలుకు రూ. 6.5 లక్షలు, పాణ్యంకు రూ.1.60 లక్షలు
- నగరపాలక రెవెన్యూ విభాగానికి గణనీయంగా ఆదాయం

కర్నూలు (టౌన్) :నగరపాలక సంస్థ పరిధిలో వ్యర్థాల సేకరణకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఈ వేలంలో పాటదారులు మధ్య పోటీ నడిచింది. కర్నూలు పరిధిలో చికెన్, మటన్, చేపల వ్యర్థాలు సేకరించేందుకు పలువురు పోటీ పడ్డారు. నగరపాలక అధికారులు పాట రూ. 1.35 లక్షలు నిర్ణయించగా రూ.6.5 లక్షలు పాట పాడి కుమార్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. అలాగే పాణ్యం, కోడుమూరు పరిధిలో వ్యర్థాల సేకరణకు రూ. 95 వేలు నిర్ణయించారు. కుమార్ అనే పాటదారుడు రూ. 1.60 లక్షలకు దక్కించుకున్నాడు. వేలంలో పాల్గొన్న 8 మంది పాటదారులు పోటీ పడటంతో నగర పాలక రెవెన్యూ విభాగానికి గణనీయంగా ఆదాయం సమకూరింది. వేలాలను నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పర్యవేక్షణ చేశారు. నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

కర్నూలు : స్థానిక ఎస్ఏపీ క్యాంప్‌నకు ఎదురుగా ఉన్న తిలక్ నగర్‌లో నివాసముంటున్న జి.మద్దిలేటి (39) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం ఉదయం బాడుగ నిమిత్తం శరీన్ నగర్‌కు వెళ్లి తిరిగి వస్తూ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎదురుగా శరీన్ నగర్ వైపు ఉన్న సర్వీస్ రోడ్‌లో ఆటో నిలుపుదల చేసి రిజిస్ట్రార్ ఆఫీసు వైపు నడుచుకుంటూ వెళ్తుండగా డోన్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. కడప జిల్లాకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వాహనాన్ని నడుపుతుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మద్దిలేటిని చికిత్స నిమిత్తం విష్ణువర్ధన్‌రెడ్డి ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తలకు, ఉదర భాగంలో బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడం వల్లే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. విష్ణువర్ధన్‌రెడ్డి నిర్లక్ష్యం వల్లే తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని భార్య నాగేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈయనకు ఒక కూతురు సంతానం.

వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు కృతజ్ఞతలు చెబుతున్న వైద్యుల సంఘం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయనను ఇటీవల నూతనంగా ఎన్నికైన ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారితో డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ వైద్యుల సమస్యలు తనకు తెలుసు అన్నారు. ఆయా విభాగాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తారన్నారు. వైద్యుల పదోన్నతులు, బదిలీలు, జీతభత్యాలకు సంబంధించినవి ఏమైనా ఉంటే లిఖిత పూర్వకంగా రాసిస్తే ప్రభుత్వానికి పంపిస్తానని తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి. శ్రీరాములు, కార్యదర్శి డాక్టర్ కేబీ విజయమోహన్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ డి. శ్రీనివాసులు, జనరల్ కౌన్సిల్ మెంబర్లు డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ కె. మాధవీశ్యామల, డాక్టర్ కె. సోమప్ప, ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.జయరామ్, డాక్టర్ ఎన్. నాగేశ్వరయ్య, డాక్టర్ ఎం. మల్లికార్జున తదితరులు ఉన్నారు.

నేడు సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ

కర్నూలు సిటీ: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. ఆయా పథకాల ద్వారా వివిధ వర్గాల ప్రజలకు చేకూరిన లబ్ధిని తెలియజేసేందుకు కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి సచివాలయంలో నేడు సంక్షేమ పథకాల బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్, ఆయా మండలాల్లోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ మండల కన్వీనర్లు, వలంటీరీలు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొననున్నారు. నియోజకవర్గంలో నేడు సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. సి.బెళగల్ సచివాలయం-1లో ఉదయం 11 గంటలకు, గూడూరు సచివాలయం-1లో మధ్యాహ్నం 1 గంటకు, కోడుమూరు సచివాలయం-1లో మధ్యాహ్నం 3 గంటలకు, కర్నూలు మండలంలోని బి.తాండ్రపాడు గ్రామంలోని సచివాలయం-1లో సాయంత్రం 4.30 గంటలకు ఆవిష్కరణ కార్యక్రమం జరగనుందని తెలిపారు.

ఆటో స్టాండ్ అడ్డాలను తొలగించకూడదు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : ట్రాఫిక్‌కు అంతరాయం పేరుతో పోలీసులు నగరంలో పలు చోట్ల ఉన్న ఆటో స్టాండ్ అడ్డాలను తొలగించడం సరికాదని సీపీఎం జిల్లాకార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. ప్రత్యామ్నాయం చూపించకుండా అటు ప్రయాణికులు...ఇటు ఆటో డ్రైవర్లను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆటో యూనియన్ ఓల్డ్ సిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఓ 21 పేరుతో ఆటో డ్రైవర్లకు విధిస్తున్న చలానాలతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏదిఏమైనా ట్రాఫిక్ పోలీసులు ఆటో స్టాండ్‌లను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకుల రవి, అబ్దుల్ దేశాయ్, విజయ్, రామాంజినేయులు పాల్గొన్నారు.

రేపు పవిత్ర అక్షతల ఊరేగింపు



డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణం పూర్తి కాబోతున్న సందర్భంగా భగవాన్ శ్రీరామ్ లల్లా విరాజ్ మాన్ వేద మంత్రాలతో పూజించిన పవిత్ర అక్షతలను ఈనెల 10వ తేదీ కర్నూలు నగరంలో ఊరేగిస్తున్నట్లు వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కర్నూలు డీఎస్పీ విజయశేఖర్‌కు ఊరేగింపుకు అనుమతి ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర అక్షతలు బుధవారం రాత్రి 12 గంటలకు గోరఖ్ పూర్ ఎక్స్‌ప్రెస్‌లో వీహెచ్‌పీ నాయకులు కర్నూలుకు తీసుకొచ్చి ఓల్డ్‌సిటీ మెయిన్ బజార్‌లోని ఏకాంతరామాలయంలో ఉంచుతారన్నారు. 10వ తేదీ ఉదయం 8 గంటలకు అక్కడి నుంచి రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయానికి బైక్ ర్యాలీలో అక్షతలను ఊరేగింపుగా తీసుకెళ్తామన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, సహ కార్యదర్శి ప్రాణేష్, కోశాధికారి సందడి మహేష్, కార్యదర్శి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్

సాఫ్ట్‌టెన్నిస్ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య

కర్నూలు (టౌన్) : ఈనెల 9 నుంచి 11 వ తేదీ వరకు కాకినాడ జిల్లా పీఠాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న 67 వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి. లక్ష్మయ్య పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 14 ఏళ్లలోపు, 17 ఏళ్లలోపు విభాగాల్లో పాల్గొంటున్న క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటితే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతారన్నారు. కార్యక్రమంలో స్టేడియం చీఫ్ కోచ్ శ్రీనివాసరావు, నవీన్, పరశురాముడు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల తనిఖీ



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య బుధవారం పెద్దటేకూరు, లక్ష్మీపురం, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీలలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను తనిఖీ చేశారు. శిబిరాల్లో వచ్చిన రోగులకు అందరికీ వైద్య సేవలు అందుతున్నాయా, వైద్యపరీక్షలు చేస్తున్నారా, వారికి మందులు అందజేస్తున్నారా అందరికీ ఫోల్డర్ బ్యాగ్స్ ఇస్తున్నారా, వైద్యులు బాగా చూస్తున్నారా అని ఆరా తీశారు. వచ్చిన వారికి పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి వివరించారు. పంచాయితీ వారితో కలిసి వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆశాలు, ఏఎన్ఎంలు రోగులు, ప్రజల ఇళ్లకు వెళ్లి క్రానిక్ పేషంట్‌లను వైద్య శిబిరాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో గురువారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు విద్యుత్ సంస్థ ఏఈ జాన్ బెర్నార్డ్ తెలిపారు. ముఖ్యంగా గాంధీ నగర్, విద్యానగర్, భాస్కర్ నగర్, ఈశ్వర్ నగర్ తదితర చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం



సోమయాజులపల్లె వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ విస్తరణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

- ప్రజలకు మాపై నమ్మకం ఉంది
- నాలుగేళ్లలో గ్రామాల రూపురేఖలే మారాయి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం : ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని తుచా తప్పకుండా అమలు చేశామని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండజూటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దేశంలోని ఏ పార్టీ కూడా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, కేవలం ఏపీలో మాత్రమే అమలవుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రజలకు ఏ సమయంలో ఏం కావాలో ఆలోచించి మేనిఫెస్టో రూపొందించి, దానిని పవిత్ర గ్రంథంగా భావించి సంక్షేమ పాలన సాగిస్తున్నారని చెప్పారు.

కళ్లముందే అభివృద్ధి ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కరోనా వల్ల ఆర్థిక సంక్షోభం ఎదురైనప్పటికీ ఎక్కడా అభివృద్ధి కుంటుపడలేదన్నారు. ప్రతి గ్రామానికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధికి బాటలు వేశామన్నారు. కళ్లముందే గ్రామ సచివాలయం మొదలుకొని మనబడి నాడు-నేడు, ఆర్‌బీకే, డిజిటల్ లైబ్రరీలు, హెల్త్ సెంటర్లు, మంచినీటి ట్యాంక్‌లు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు ఇంకా ప్రజలకు ఉపయోగపడే పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇది కేవలం నాలుగున్నర సంవత్సరాల వైఎస్సార్‌సీపీ పాలనలోనే సాధించామన్నారు.

నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం

ఓర్వకల్లు : ప్రజలకు, రైతులకు నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సోమయాజులపల్లె వద్ద ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ విస్తరణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులను విస్తరించడంతో ప్రజలకు, రైతు సోదరులకు విద్యుత్ సమస్య తీరుతుందన్నారు. కొన్నేళ్లుగా పొరుగు మండలం నుంచి విద్యుత్ సరఫరా కావడంతో ఉయ్యాలవాడ, మీదివేముల, ఉప్పలపాడు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఉయ్యాలవాడ సమీపంలో రూ.1.80 కోట్లతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

డప్పు కళాకారుల హక్కుల కోసం ఉద్యమం

కర్నూలు(సెంట్రల్): డప్పు కళాకారుల హక్కులు, ఆర్థిక అభ్యున్నతుల కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏపీ డప్పు కళాకారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీడీకేయూ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డప్పు కళాకారులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. గుర్తింపు కార్డులు ఉన్న వారికి నెలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ఉచితంగా కాళ్ల గజ్జెలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, కరుణాకర్ పాల్గొన్నారు.

15న విజయవాడలో మహా ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో నవంబర్ 15వ తేదీన మహాప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల తెలిపారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో నగరంలోని అన్ని కార్మిక సంఘాల నాయకులతో ఆమె సమావేశమైంది. మహా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజలను చైతన్యం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, సీహెచ్ సాయిబాబా, టి.రాముడు పాల్గొన్నారు.

18న ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

కర్నూలు కల్చరల్: ఈనెల 18వ తేదీన ఝాన్సీ లక్ష్మీ బాయి జయంతిని నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ దుర్గా వాహిని మాతృశక్తి జిల్లా కన్వీనర్ జంపాల రాధిక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఝాన్సీ లక్ష్మీ బాయిని స్మరించుకునేందుకు నగరంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓల్డ్‌సిటీలోని వాసవీ కళాశాలలో జయంతి ఉత్సవం జరుగుతుందని, మహిళలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్


కర్నూలు సిటీ: కొత్తాళం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్న వి.భీమన్నను సస్పెండ్ చేసినట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించారనే ఆరోపణలు రావడంతోనే సదరు టీచర్‌ను సస్పెండ్ చేశామని, విద్యార్థిని, విద్యార్థులపై అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఈఓ హెచ్చరించారు.

ఉద్యాన రైతులకు ప్రోత్సాహం

కల్లూరు: ఉపాధి హామీ పథకం ఉద్యాన రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని ఏపీడీ లక్ష్మన్న అన్నారు. బుధవారం చిన్నటేకూరు గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన గులాబీ తోటను పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం మొక్కలు ఇవ్వడంతో పాటు రెండు సంవత్సరాలు వాటి నిర్వహణ ఖర్చులు ఇస్తుందని చెప్పారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కల్లూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. సుబ్రహ్మణ్యకుమార్ పేర్కొన్నారు. బుధవారం దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని నిరంతరం సాధన చేస్తే అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చన్నారు. వివిధ కోర్సులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.



డాక్యుమెంట్స్ పోయినవి

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ గోని భాస్కర్ తండ్రి గోని లేట్ గోని కాశీమన్న, ఇంటి నెం. బి/సి-15, బి-క్యాంప్, కర్నూలు సిటీ, కర్నూలు జిల్లా వారి తరఫున తెలియజేయడం ఏమనగా...

కె.కృష్ణవేణమ్మ గారు జె.మధుసూదనరావు గారి నుండి తేది: 27-11-2008 నాడు రిజిష్టర్ ఖరారునామాతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం. 7126/2008 కొనుగోలు చేసినారు. నా క్లయింట్ అగు గోనెభాస్కర్ గారు తేది: 30-10-2023 నాడు కర్నూలు ఎ.పి.యస్.ఆర్.టి.సి. బస్టాండు దగ్గర జిరాక్స్ సెంటర్‌కు పోవుచున్నప్పుడు మార్గమధ్యంలో క్రింది షెడ్యూలు దాఖల ప్లాటుకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్ అనగా రిజిష్టర్ విక్రయ ఖరారు నామాతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం. 7126/2008 తేది: 27-11-2008 పోయినది. ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 7126/2008 తేది: 27-11-2008 ఎవరికైనన దొరికినచో నన్ను గాని నా క్లయింట్‌ను గాని సంప్రదించగలరు. అట్టి వారికి తగిన పారితోషికం ఇవ్వబడునని తెలియజేయడమైనది. అలాగే క్రింది షెడ్యూలు దాఖల ఆస్తికి సంబంధించి ఎవరికైనను ఎలాంటి హక్కు అధికారములు వున్నచో ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోపల సరియైన ఆధారములతో నన్ను సంప్రదించగలరు. తరువాత ఎలాంటి అభ్యంతరములు వచ్చినను చెల్లనేరవని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: కర్నూలు డి॥, కల్లూరు సబ్ డి॥, కర్నూలు మున్సిపల్ కార్పోరేషన్‌లో చేరిన 87వ వార్డు నందలి ప్లాటు స్థలము అనగా కల్లూరు గ్రామ సర్వేనెంబరు 702/2పైకి య.4.05 సెంట్లు గల భూమి నందు ఇండ్లప్లాట్లకు నిర్ణయించి యల్.డి.నెం. 257/71రుగా అప్రూవల్ కాబడి తదుపరి గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ వారిచే Memo No. 20881/M1/2006 రు Date: 01-12-2006 వారిచే రెగ్యులరైజ్ చేయబడిన లే-అవుట్‌లోని ఎ-బ్లాక్ నందలి పాలిమేరకు ప్లాట్లపైకి 13వ నెంబరు ప్లాటు స్థలమునకు చెక్కుబంది మరియు కొలతలు. **చెక్కుబంది: తూర్పు:** 6వ నెంబరు ప్లాటు **పడమర:** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** ఇదే నెంబరు ప్లాటులోని 3x60 అడుగుల స్థలము **దక్షిణం:** 12వ నెంబరు ప్లాటు **ఈ నలుదిశలకు లోనైన ప్లాటునకు కొలతలు: తూర్పు దిశన:** ఉ.ద: 37.25 అడుగులు, పడమర దిశన: ఉ.ద: 35.25 అడుగులు, ఉత్తర దిశన: తూ.ప: 60 అడుగులు, దక్షిణము దిశన: తూ.ప. 60 అడుగులు. స్థల విస్తీర్ణము 2175 చ.అ.లు లేక 241.66 చ.గలు

T.Narayana Reddy, B.A., L.L.B., Advocate
Opp: District Court, Kurnool. Cell: 93938 30666